క్లుప్తంగా

శివ భక్తులకు అన్నదానం

దౌల్తాబాద్: మండలంలోని సంగాయిపల్లి గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు గౌస్ శివభక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ కులమతాలకతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండాలనే ఉద్దేశంతో శివస్వాములకు అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గౌస్‌ను గ్రామస్తులు అభినందించారు.

రేపు కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశం

తాండూరు రూరల్: కాంగ్రెస్ పార్టీ తాండూరు మండల ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకులు మల్కాపూర్ జనార్దన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని ఎంపీటీ ఫంక్షన్‌హాల్లో నిర్వహించే సమావేశానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, సీనియర్ నాయకులు ఉత్తమ్‌చందు, రాజ్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. కావున పార్టీ ముఖ్య కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

మహాద్వారం నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచి చంద్రమౌళి

ధారూరు: వీరభద్రేశ్వరస్వామి దేవాలయానికి మహాద్వారం నిర్మించడానికి బుధవారం వీర శైవ సమాజం బాధ్యుడు జ్ఞానేశ్వర్ భూమి పూజ చేశారు. తాండూర్–హైదరాబాద్ ప్రధాన రోడ్డు మార్గం నుంచి 60 ఫీట్లు వదిలిపెట్టి మహాద్వారం నిర్మించడానికి నిర్ణయించారు. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు సీసీ రోడ్డును ప్రభుత్వ నిధులతో ముందుగానే నిర్మించారు. భక్తులు నేరుగా ఆలయానికి రావడానికి ఈ ద్వారం సూచికలా పనిచేస్తుందని జ్ఞానేశ్వర్ తెలిపారు. మహాద్వారం నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చారని సర్పంచు చంద్రమౌళి, సమాజం బాధ్యుడు జ్ఞానేశ్వర్, శెట్టి శివానందం, కిరణ్‌కుమార్, శివకుమార్, విజయకుమార్, అమరేశ్వర్‌రావు తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్

తాండూరు టౌన్: యువత క్రీడల్లో రాణించాలని కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్ అన్నారు. బుధవారం పాత తాండూరులో ప్రారంభమైన యూనిటీ క్రికెట్ కప్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయి.. కాసేపు క్రికెట్ ఆడారు. అనంతరం మాట్లాడుతూ యువతకు ఏదో ఒక ఆటలో ప్రావీణ్యత ఉంటుందని, దానిని గుర్తించి సరైన శిక్షణ ఇస్తే పోటీల్లో రాణిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ఎనిమిదేళ్లుగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు కౌన్సిలర్ అభినందనలు తెలిపారు. టోర్నీ నిర్వాహకులు నవాజ్, సంజీవ్, సమద్, ఉస్మాన్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

'పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి'



గ్రామస్తుల నుంచి పన్నులు స్వీకరిస్తున్న కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరు తమ ఇంటి, దుకాణ సముదాయాల పన్నులు చెల్లించి గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో పలువురి వద్ద ఇంటి, దుకాణ సముదాయాల పన్నులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీ పరిధిలో నిర్వహించే కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతున్నామన్నారు. రఘు, కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శివాజీ విగ్రహావిష్కరణ రేపు

తాండూరు రూరల్: కోటబాసుపల్లిలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు సర్పంచు కుర్వ నాగర్జున బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు బస్టాండ్ సమీపంలో విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉందన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, పీఏసీఎస్ డైరక్టర్ సురేందర్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు.

అప్‌గ్రేడ్ అయ్యేదెన్నడో?

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. అరకొర వైద్య సదుపాయాలతో ఉన్న ప్రాథమిక చికిత్స కేంద్రాల్లో నాణ్యమైన వైద్యం అందని ద్రాక్షలా మారింది. దీంతో ప్రజల ప్రాణాలకు భరోసా లేకుండా పోతోంది.

- మెరుగైన చికిత్స అందేదెప్పుడో?
- పీహెచ్‌సీ స్థాయి పెరగక కుంటుపడిన వైద్య సేవలు
- దూరప్రాంతాలకు వెళ్లేలోపు విషమిస్తున్న ఆరోగ్య పరిస్థితులు
- సీహెచ్‌సీగా మార్చాలని స్థానికుల డిమాండ్



దౌల్తాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి

దౌల్తాబాద్: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యం ఉన్నా.. ప్రభుత్వం ఆదిశగా ముందుకు సాగలేకపోతోంది. పల్లె దవాఖానాలపై దృష్టి పెడుతున్నప్పటికీ.. ఇప్పటికే ఉన్న పీహెచ్‌సీ స్థాయిని పెంచడాన్ని విస్మరిస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యసేవల కోసం దూరప్రాంత ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేస్తూ.. చేతులు దులుపుకుంటున్నారు. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లే సరికి రోగి పరిస్థితి విషమించి ప్రాణాల మీదకు వస్తోంది.

రోగుల తాకిడి అధికమే..

మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పరిధిలో 33 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రతి రోజు సుమారు 100 మంది వరకు రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. సోమ, శుక్రవారాల్లో ఓపీ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. సీజనల్ వ్యాధుల సమయంలో ఓపీ సాధారణ సమయ స్థితికి మించిపోవడం సహజమే. దీంతో పాటు నెలకు 15 నుంచి 20 వరకు ప్రసవాలు జరుగుతుంటాయి. అయినా అధికారులు ప్రస్తుత పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. మండలంలో ఏదైనా అనుకోని సంఘటన, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను పీహెచ్‌సీకి తరలిస్తే.. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొడంగల్, కోస్గి ఆస్పత్రులకు పంపిస్తున్నారు. దూరప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులకు చేరేలోపు క్షతగాత్రుల పరిస్థితి మరింత విషమంగా మారి.. వారి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

సీహెచ్‌సీకి అర్హతలున్నా..

దౌల్తాబాద్‌లోని పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసేందుకు అర్హతలు ఉన్నప్పటికీ అధికారులు ఆదిశగా ముందడుగు వేయడంలేదు. గతంలో ఆస్పత్రి సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకురాగా ప్రతిపాదనలు పంపిచామన్నారు. సాధారణంగా 30వేల లోపు జనాభ ఉంటే పీహెచ్‌సీని ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం మండల జనాభ 40వేలకు పైగా ఉండడంతో పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిత్యం ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో వ్యాక్సినేషన్ ఇతర కార్యక్రమాలను పరిశీలించేందుకు కేవలం ఒక్క డాక్టర్ మాత్రమే ఉన్నారు. సీజనల్ వ్యాధుల సమయంలో రోగుల తాకిడి అధికంగా ఉంటుండడంతో వైద్యుడిపై ఒత్తిడి పెరుగుతోంది. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేస్తే వైద్య సిబ్బంది పెరగడంతో పాటు ఆస్పత్రిలో పడకల సంఖ్య పెరిగి మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం ఉందని, ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోగుల తాకిడి అధికం



పీహెచ్‌సీకి రోగుల తాకిడి అధికంగా ఉంటోంది. సాధారణ రోజుల్లో 80 మంది, సోమ, శుక్రవారాల్లో 100కుపైగా రోగులు వస్తుంటారు. ఇక్కడ ఒక్కడినే ఉండడంతో పని ఒత్తిడి పెరుగుతోంది. మరొక వైద్యుడిని నియమిస్తే బాగుంటుంది. ప్రస్తుతం నెలకు 2,500 వరకు ఓపీలు వస్తున్నారు. సీహెచ్‌సీగా ఏర్పాటు చేస్తే పేషంట్లు పెరగడంతో పాటు.. మెరుగైన సేవలు అందించేందుకు ఆస్కారం ఉంటుంది.

– రతన్‌లాల్, వైద్యాధికారి, దౌల్తాబాద్

పదిగంటలకు హాజరుకావాల్సిందే..

- ఉద్యోగులకు జియో అటెండెన్స్
- సెల్ఫీ ఫొటో పెట్టి హాజరు వేయాలి



జియో అటెండెన్స్ వేస్తున్న ఆర్‌ఐ రాజిరెడ్డితో పాటు సిబ్బంది

పెద్దేముల్: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే.. అధికారులు సమయపాలన పాటించాల్సిందే నంటూ కలెక్టర్ నారాయణరెడ్డి జియో(జీఈఓ) అటెండెన్స్‌కు శ్రీకారం చుట్టారు. దీంతో అధికారుల డుమ్మాకు చెక్ పడనుంది. సాకులు చెప్పి తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది. పెద్దేముల్ మండలంలో మూడు రోజులుగా జియో అటెండెన్స్ కొనసాగుతోంది. రెవెన్యూ, మండల పరిషత్, ఉపాధితో పాటు పలు శాఖల అధికారులు కార్యాలయానికి ఉదయం 10 గంటల లోపు చేరుకోవాలి. వచ్చిన వెంటనే సెల్ఫీ ఫొటోలు పెట్టి హాజరు వేయాలి. ఇందులో భాగంగా బుధవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి తన సిబ్బందితో జియో అటెండెన్స్ వేశారు. మొదటి రోజు పంచాయతీ కార్యదర్శుల్లో కొందరు యాప్ లాగిన్ చేసుకోక, మరి కొందరికి లాగిన్ రాక ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. మరి కొంత మంది విధులకు హాజరైనా లాగిన్ కాకపోతే.. తమకు ఆ రోజు హాజరు పడదేమోనని ఆందోళన చెందారు. ఇదిలా ఉండగా.. అధికారులకు కలెక్టర్ జియో సెల్ఫీ అటెండెన్స్ తీసుకురావడం.. అధికారులు సమయానికి విధులకు హాజరు కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీబీ బాధితులను ఆదుకోండి

ఎంపీపీ దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న దాతలు

కొడంగల్: టీబీ పేషంట్లకు పౌష్టికాహారం అందించడానికి, క్షయ బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్ కోరారు. బుధవారం క్షయ బాధితులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్, డాక్టర్ రవీంద్రయాదవ్ 20 మంది టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. కొడంగల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 10 మందికి, దేశ్‌ముఖ్ కుటుంబ సభ్యుడు డాక్టర్ మల్లారెడ్డి ఆర్థిక సాయంతో 10 మందికి కిట్లను పంపిణీ చేశారు. డ్రై ఫ్రూట్స్, గుడ్లు, బియ్యం, కంది పప్పు, నిత్యావసర సరుకులు పెద్ద మొత్తంలో పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. టీబీ, క్షయ బాధితులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యుడు దానప్ప యాదవ్, కో ఆప్షన్ మెంబర్ మునీర్, శ్రీనివాస్ గుప్తా, కొడంగల్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

'క్రమం తప్పకుండా చికిత్స చేయించాలి'



ప్రత్యేక అవసరాల పిల్లలకు చికిత్స చేస్తున్న డాక్టర్

పరిగి: ప్రత్యేక అవసరాల పిల్లలకు తప్పకుండా చికిత్స చేయించాలని వారి తల్లిదండ్రులకు ఫిజియో థెరపీ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచితంగా ఫిజియో థెరపీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం ప్రత్యేక అవసరాల పిల్లలకు చికిత్స చేస్తామని చెప్పారు. క్రమం తప్పకుండా చికిత్స చేయించడం వలన త్వరగా కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. ఇంటి వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి వ్యాయామాలు చేయించాలని తల్లిదండ్రులకు చూపిస్తామని చెప్పారు. ప్రత్యేక అవసరాల పిల్లల పెద్దలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'ఇంటింటికీ దేశం' విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నాయకుడు శ్రీనివాస్

కొడంగల్: ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా నాయకులు మెట్టుకాడి శ్రీనివాసు, డీకే రాములు అన్నారు. బుధవారం కోస్గిలో నిర్వహించిన టీడీపీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల సాధికారత కోసం నందమూరి తారక రామారావు పార్టీని స్థాపించారని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం చేపట్టామని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కుమ్మరి అంజిలయ్య, అచ్యుతారెడ్డి, వెంకటప్రసాద్, అంబదాస్, శ్రీనివాస్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిర్లింగాల మహాపడి పూజ



హారతి పడుతున్న భక్తులు

యాలాల: సర్పంచి సిద్రాల సులోచన, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ ఇంటి ఆవరణలో నిర్వహించిన జ్యోతిర్లింగాల మహాపడి పూజకు శివమాలధారులు హాజరై పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పడిపూజను అంజిరెడ్డి, గురుస్వాములు పాండుగౌడ్, యాదగిరి, ప్రభాకర్‌చారి ఆధ్వర్యంలో జరిపారు. పూజా కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి కుమారుడు పట్నం రినీష్‌రెడ్డి పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శివమాలధారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అనంతయ్య ముదిరాజ్, నాయకులు మల్లారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'కష్టపడితే ఫలితం మీదే..'



విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్న టీచర్లు

పెద్దేముల్: కష్టపడితే ఫలితం మీదేనని, చదివితే సాధించలేనిదంటూ ఏమీ లేదని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శాంతప్ప అన్నారు. బుధవారం ఉన్నత పాఠశాలల్లో విద్యాశాఖ ఆదేశాల మేరకు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు సాయంత్రం వేళల్లో స్నాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాల మేరకు రోజు సాయంత్రం పోషక ఆహారంలో భాగంగా ఉడకబెట్టిన శనగలు, పెసర్లు, బొబ్బెర్లు అందచేయడం జరుగుతుందన్నారు. కావున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ద్యావరి నరేందర్‌రెడ్డి, సుధారాణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

కొడంగల్: రావులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తెలుగు, ఇంగ్లీష్ మీడియం తరగతులను బోధించారు. జిల్లా విద్యాధికారిగా బద్రినాథ్, ఎమ్‌ఈఓగా దస్తగిరి, హెచ్‌ఎమ్‌గా పూజ వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామలమ్మ, ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, వెంకటేశం, ముత్యప్ప, అశోక్‌కుమార్, శ్రీవాణి, గీత, నరేందర్, అంజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్

- ఆయన సేవలు నేటి ప్రజానికానికి స్ఫూర్తిదాయకం
- అడవి బిడ్డల జీవన విధానాన్ని కాపాడిన సద్గురు
- సేవాలాల్ జయంతిలో వక్తలు



దోమ: బడేంపల్లి తండాలో.. సేవాలాల్ జయంతిలో ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి



మర్పల్లిలో.. బంజారా నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

పూడూరు: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు గిరిజన ఆవాసాల్లో బుధవారం ఘనంగా జరిగాయి. జయంతి కార్యక్రమంలో గిరిజనులు, పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని సేవలాల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. పూడూరు మండలం తిర్మలాపూర్‌లో డీసీసీ కార్యదర్శి పెంటయ్య ఆధ్వర్యంలో జరిగిన సేవాలాల్ జయంతిలో డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొని సద్గురు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే గిరిజన తండాలు అభివృద్ధి చెందాయని చెప్పారు. గిరిజనులకు ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహం కల్పించాలని, కాలానికనుగుణంగా వారిలో మార్పు తెచ్చేందుకు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తిర్మలాపూర్ సర్పంచ్ కమ్లీబాయి పెంటయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ రాములు, బంజారా నాయకులు కిషన్, రాంజీ, రాంచందర్, బాలు, హరిదాస్, బానుప్రకాష్, వినోద్‌కుమార్, మల్లేశ్, లక్ష్మణ్, గోపాల్, సురేష్, రమేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహించిన సేవాలాల్ జయంతిలో డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని.. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. గిరిజనుల ఆచార సాంప్రదాయాలు ఎంతో ప్రత్యేకమైనవని, వారి అభ్యున్నతికి సేవాలాల్ చేసిన కృషి నేటి ప్రజానికానికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, నాయకులు అంజూ, కనకం మొగులయ్య, రాంలాల్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: బంజారాల హక్కుల కోసం పోరాడిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల పరిధిలోని బొట్లోనితండాలో సేవాలాల్ ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పాల్గొని.. సేవాలాల్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

గిరిజనుల అభ్యున్నతికి..

మోమిన్‌పేట: బంజారాల ఆరాధ్యుడు సంత్ సేవలాల్ జయంతిని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ శైలజారెడ్డి మాట్లాడుతూ అడవి బిడ్డల అభ్యున్నతికి ఆయన ఎంతగానో కృషి చేశారని, వారి జీవన విధానాన్ని కాపాడేందుకు సేవలాల్ చేసిన కృషి అమోఘమని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలు తండాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికవేత్త సేవాలాల్

దోమ: లంబాడాల ఆరాధ్య దైవం, సంత్ సేవాలాల్ మహరాజ్ దేశం గర్వించదగ్గ ఆధ్యాత్మికవేత్త అని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బడేంపల్లి తండాలో జరిగిన సేవలాల్ పూజ కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సేవలాల్ అడవి బిడ్డల ప్రత్యేకమైన ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక దృక్పథం, సామాజిక సాంస్కృతిక జీవన విధానాన్ని కాపాడడంలో ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు కవిత, గోపాల్, పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, ప్రధానకార్యదర్శి కృష్ణారెడ్డి, ప్రచారకార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయన ఆశయ సాధనకు కృషి

ధారూరు: గిరిజనుల అభ్యున్నతికి అహర్నిషలు పాటుపడిన సద్గురు సేవాలాల్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేద్దామని స్టేషన్ ధారూరు, డీకే తండా, ఎస్ఎల్‌తండాల బంజారా యువజన సంఘం నాయకులు అన్నారు. జయంతి సందర్భంగా.. గిరిజన మహిళలు బంజారా నృత్యం చేశారు.



పూడూరు: మన్నెగూడలో.. డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి తదితరులు



కుల్కచర్ల: అల్లాపూర్ తండాలో డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి తదితరులు



బొంరాస్‌పేట: మండల కేంద్రంలో..



మోమిన్‌పేటలో..

కొడంగల్‌లో సేవాలాల్ ఆలయం

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: గిరిజనులు సేవాలాల్ ఆశీర్వాదంతో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నారని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా బుధవారం పట్టణ శివారులోని సిద్దనొంపు సమీపాన ఏర్పాటు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని సేవాలాల్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందని, దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సేవాలాల్ జయంతిని తెలంగాణలో అధికారికంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తండాలను జీపీలుగా గుర్తించామని, రిజర్వేషన్ల ప్రకారం లంబాడాలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ఎస్టీలకు అన్ని రంగాల్లోనూ అవకాశం ఇస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్‌లో గిరిజన భవన్ నిర్మాణం కోసం స్థలం కేటాయించామని, సేవాలాల్ మహరాజ్‌కు గుడి నిర్మించడానికి సహకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, గిరిజన సంఘం నేతలు దేశ్యానాయక్, రామూనాయక్, బాల్‌సింగ్ నాయక్, కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల నుంచి గిరిజనులు పాల్గొన్నారు.